ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
ఆదివారం, 13 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 29 | పేజీలు: 4 వెల: 5




# ఒకే పరిపాలన.. ఒకే చట్టం!

## జీహెచ్‌ఎంసీ స్థానంలో క్యూర్-2026

- ఓఆర్ఆర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు కొత్త చట్టం
- అక్రమ నిర్మాణాలపై నాలుగు రకాల చర్యలు
- ఆస్తిపన్నుపై 100–300 శాతం వరకు జరిమానా
- హైడ్రాకు చట్టబద్ధత.. ప్రత్యేక పోలీస్‌స్టేషన్
- శాసనసభలో క్యూర్–2026 బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** వేర్వేరు సంస్థలు, శాఖలు, వ్యవస్థల మధ్య సమన్వయ లోపాలతో అస్తవ్యస్తంగా మారిన మహానగర పరిపాలనకు కొత్త రూపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం లక్ష్యంతో రూపొందించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)-2026 బిల్లును శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని ప్రతిపాదించింది. ఓఆర్ఆర్ పరిధిలోని జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తించనుంది. క్యూర్ బిల్లులో 5 భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా అత్యున్నత పరిపాలన మండలి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో కార్యనిర్వాహక కమిటీతోపాటు మరో 10 రకాల కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

........(తరువాయి 2లో)




# బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఆమోదం

## భారత్ దౌత్యంతో ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా అంగీకారం



**ఢిల్లీ :** భారత్ దౌత్య విజయం సాధించింది. పశ్చిమాసియా సంక్షోభంపై విభేదాలు ఉన్నప్పటికీ బ్రిక్స్ సభ్యదేశాలన్నీ ఏకాభిప్రాయంతో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపాయి. అరబ్ దేశాలైన ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియాలు కూడా ఉమ్మడి ప్రకటనకు అంగీకరించడం విశేషంగా నిలిచింది. శనివారం జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో సభ్యదేశాల ఆమోదంతో ఢిల్లీ డిక్లరేషన్ ఆమోదం పొందినట్లు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రకటించారు. బ్రిక్స్ కూటమి పూర్తిగా ఏకాభిప్రాయంతో పనిచేస్తుంది. ఏ ఒక్క సభ్యదేశం వ్యతిరేకించినా ఉమ్మడి ప్రకటన నిలిచిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇరాన్, యూఏఈలు ప్రారంభంలో కఠిన వైఖరి

........(తరువాయి 2లో)

చివరి నిమిషం వరకు కొనసాగిన ఉత్కంఠభరిత చర్చలు

ఏకాభిప్రాయంతో ఉమ్మడి ప్రకటనకు సభ్యదేశాల ఆమోదం

మారుతున్న ప్రపంచాన్ని పాత వ్యవస్థలు నడపలేవన్న మోదీ

గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం ఉండాలని స్పష్టం

బ్రిక్స్ సదస్సు ముగింపు ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ

# 2–3 ఏళ్లలో ఈబైక్‌ల వాటా 20 శాతానికి

- రూ.779 కోట్లతో కొత్త ప్లాంట్.. ఏటా 5 లక్షల వాహనాల ఉత్పత్తి లక్ష్యం
- రూ.2 లక్షలలోపే కొత్త మోడళ్లు.. విదేశీ మార్కెట్లపై సంస్థ దృష్టి
- ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ అల్ట్రావైలెట్ ఆటోమోటివ్ అంచనా



**కాకతీయ, బిజినెస్ డెస్క్ :** దేశీయ మోటార్‌సైకిల్ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ బైక్‌లకు ఆదరణ వేగంగా పెరుగుతోందని బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ టూ వీలర్ సంస్థ అల్ట్రావైలెట్ ఆటోమోటివ్ తెలిపింది. రాబోయే 2-3 ఏళ్లలో దేశంలో మొత్తం మోటార్‌సైకిళ్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ బైక్‌ల వాటా 20 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది. తమిళనాడులోని హోసూర్ సమీపంలో కొత్త తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రాబోయే 5 ఏళ్లలో రూ.779 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. కొత్త ప్లాంట్ తొలి దశలో ఏటా 2.5 లక్షల వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 5 లక్షల యూనిట్లకు

........(తరువాయి 2లో)

# దసరా నుంచి కొత్త చేయూత పెన్షన్లు

- ఈ నెలాఖరు వరకు దరఖాస్తుల పరిశీలన
- వచ్చే నెల మొదటి వారంలో లబ్ధిదారుల ఎంపిక
- ధ్రువీకరణ పత్రాల జారీకి వెసులుబాటు
- 2.5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం అనుమతి

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో కొత్త చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఈ నెలాఖరు వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ధ్రువీకరణ పత్రాల జారీకి వెసులుబాట్లు కల్పించి, వచ్చే నెల మొదటి వారంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని భావిస్తోంది. దసరా పండుగ నుంచి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. దీనికి అనుగుణంగా ఆగస్టు 9 నుంచి పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ దరఖాస్తులను స్వీకరించింది. తొలుత ఆగస్టు 31 వరకు గడువు విధించగా.. ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 15 వరకు పొడిగించింది. సర్టిఫికెట్లు లేకుండానే దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలన సమయంలో అందిస్తే సరిపోతుందని సూచించింది.

**ఒంటరి మహిళలకు ధ్రువీకరణ పత్రాల ఇబ్బందులు**

విడాకులు పొందిన 18 ఏళ్లు దాటిన మహిళలు విడాకుల పత్రం లేదా కోర్టు ఉత్తర్వులు సమర్పించాలి. ఏడాదికి పైగా ఒంటరిగా ఉన్నట్లు తహసీల్దార్ విచారణ నివేదిక అవసరం. పెళ్లి కాకుండా ఒంటరిగా ఉన్న మహిళలు గ్రామాల్లో 30 ఏళ్లు, పట్టణాల్లో 35 ఏళ్లు దాటితే పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ఈ నిబంధనలతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు.

**వితంతువుల సర్టిఫికెట్లపైనా స్పష్టత కరువు**

భర్త మరణించి ఏడాది, రెండేళ్లలోపు ఉంటే తహసీల్దార్,

........(తరువాయి 2లో)







# సుద్దాల అశోక్ తేజకు తెలంగాణ తెలుగు తేజం పురస్కారం

- బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక పురస్కారానికి ఎంపిక
- కవి, సినీ గేయ రచయితగా విశిష్ట సేవలకు గుర్తింపు
- ఈ నెల 22న కరీంనగర్‌లో అవార్డు ప్రదానోత్సవం
- సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయన ఎంపికయ్యారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా అందించే రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు

........(తరువాయి 2లో)

# కొత్తగా చేర్చలేదు.. గతంలో ఉన్నవే!

- 22ఏ జాబితాపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం
- ప్రభుత్వ భూములు కబ్జా కాకుండానే నిషేధిత చట్టం
- పొరపాటున చేరిన భూములను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నాం
- ధరణిలో 80 మాడ్యూల్స్.. భూభారతిలో 5కే పరిమితం
- ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వే
- అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** నిషేధిత భూముల జాబితాలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క ఎకరమూ చేర్చలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో ఉన్న భూములన్నీ గతంలోనే ఉన్నవని, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అదే జాబితాను కాపీ చేసి అప్‌లోడ్ చేసిందని తెలిపారు. ప్రభుత్వ భూములను బలమున్నవారు కొల్లగొట్టకుండా కాపాడేందుకే నిషేధిత భూముల చట్టాన్ని తీసుకువచ్చారని చెప్పారు. 22ఏ నిషేధిత భూములపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రభుత్వ భూములను బలవంతులు ఆక్రమించకుండా కాపాడటమే 22ఏ నిషేధిత జాబితా ప్రధాన ఉద్దేశమని పొంగులేటి తెలిపారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారని గుర్తుచేశారు. ఇలాంటి అక్రమాలు మళ్లీ జరగకుండా నిషేధిత భూముల జాబితాను

........(తరువాయి 2లో)

# ప్రజలకు చేరువగా హైడ్రా సేవలు

- అధికారిక వెబ్‌సైట్ ప్రారంభించిన కమిషనర్ రంగనాథ్
- చెరువులు, భూములు, విపత్తుల వివరాలు ఒకే వేదికపై
- అత్యవసర సహాయానికి 24 గంటల హెల్ప్‌లైన్ 1070
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



**కాకతీయ, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వహణ, చెరువుల పరిరక్షణ, ఆస్తుల రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోAకి తీసుకొచ్చింది. ప్రజలకు అవసరమైన సేవలు, అత్యవసర సమాచారం, చెరువులు, భూములు, వాతావరణ పరిస్థితులు, హైడ్రా పరిధి తదితర వివరాలు ఒకే వేదికపై అందుబాటులో ఉండేలా కొత్త పోర్టల్‌ను రూపొందించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈమేరకు ఆయన పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా అందిస్తున్న సేవలు, కార్యకలాపాలు, అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. చెరువుల హద్దులు, కాలువలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణకు

........(తరువాయి 2లో)

# కొత్తగా చేర్చలేదు.. గతంలో ఉన్నవే!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చారని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2016లో జీవో 121 తీసుకువచ్చారని, ఆ జీవో ద్వారా అనేక మంది రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని మంత్రి ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని తెలిపారు.

**ప్రభుత్వమే విక్రయించిన భూములూ 22ఏలో**

నిషేధిత జాబితాలో ఉండకూడని కొన్ని భూములు మొదటి నుంచే అందులో ఉన్నాయని పొంగులేటి వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో జారీ చేసిన జీవోల ఆధారంగా ఆ జాబితా రూపొందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అదే కాపీని అప్‌లోడ్ చేసిందని, అధికారులు దానిని ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేయడంతో పొరపాట్లు జరిగాయని చెప్పారు. గతంలో ప్రభుత్వం విక్రయించిన భూములు, ప్లాట్లుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఇచ్చిన భూములు కూడా పొరపాటున 22ఏ జాబితాలో చేరాయని తెలిపారు. అధికారులు చేసిన పొరపాట్లను యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. గతంలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఇచ్చిన జీవోను ఎవరైనా చూపిస్తే వెంటనే భూమిని జాబితా నుంచి తొలగిస్తున్నామని స్పష్టం చేశారు.



**ధరణిలో 80 మాడ్యూల్స్‌తో ఇబ్బందులు**

ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేసే విధానం వల్ల గతంలో ఎన్నో అక్రమాలు జరిగాయని మంత్రి అన్నారు. ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులుగా కేవలం 5 మాడ్యూల్స్ మాత్రమే ఉంచామని వివరించారు. దొరల పాలనలో పాసుపుస్తకాలు ఉండేవి కానీ భూములు మాత్రం ఉండేవి కావని పొంగులేటి విమర్శించారు. ధరణి చట్టం తీసుకువచ్చి బంధువులు, రాజకీయ అనుచరులకు పాసుపుస్తకాలు ఇచ్చారని ఆరోపించారు. భూములు లేకపోయినా కొందరికి పాసుపుస్తకాలు ఇచ్చి కోట్ల రూపాయల రైతుబంధు నిధులు చెల్లించారని, భూమిలేని వారికి రైతుబంధు ఇచ్చి వేల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టారని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మాక్ అసెంబ్లీ నిర్వహించడం ఎందుకని మంత్రి ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా బయట మాక్ అసెంబ్లీ పెట్టుకుని రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

**ధరణి పేరుతో వేలాది ఎకరాలు చెరబట్టారు**

ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకుని గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా భావించారని విమర్శించారు. ధరణి పోర్టల్‌లో తప్పుల నమోదుతో లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణిలో జరిగిన తప్పుల కారణంగా వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మంత్రి అన్నారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల భూములపై నిఘా పెట్టారని విమర్శించారు. భూభారతి చట్టం ద్వారా ఆ ఇబ్బందులను తొలగించి రైతులకు భూములపై స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ప్రజల ఆస్తుల పరిరక్షణే లక్ష్యం**

నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన భూములను గుర్తించి తొలగించడంతో పాటు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని పొంగులేటి స్పష్టం చేశారు. భూముల రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. భూసర్వే పూర్తయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా భూముల హద్దులు, హక్కులు, రికార్డుల విషయంలో స్పష్టత వస్తుందని మంత్రి తెలిపారు. రైతులు, పేదలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా భూభారతి ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

### రైతుల వివరాలు విదేశీ సంస్థ చేతిలో

**కోట్లాది మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెరాసిస్ సంస్థను తొలగించి, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఐసీకి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం రాష్ట్రంలోని 387 గ్రామాలకు నక్షలు లేవని చెప్పారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలోని గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని వివరించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇప్పటికే భూముల సర్వే పూర్తి చేసి రైతులకు పాసుపుస్తకాలు అందజేశామని తెలిపారు. వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వేను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. భూముల హద్దులు, యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.**

# బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

అవలంబించడంతో చివరి నిమిషం వరకు ఉత్కంఠ కొనసాగింది. అయితే భారత్ తెర వెనుక జరిపిన వరుస చర్చలతో ప్రతిష్టంభన తొలగిపోయింది. పశ్చిమాసియా సంక్షోభంపై తీవ్ర విభేదాలు ఉన్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో భారత్ కీలక పాత్ర పోషించింది.

**పాత వ్యవస్థలు ఇక పనికిరావు**

బ్రిక్స్ సదస్సు ప్రారంభ సెషన్ ముగిసిన అనంతరం ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కరచాలనం చేస్తూ కనిపించారు. సదస్సు ముగింపు ప్రసంగంలో మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. మారుతున్న ప్రపంచాన్ని పాతబడిపోయిన వ్యవస్థలు నడపలేవని స్పష్టం చేశారు. ప్రాతినిధ్యం, స్పందన, నియమ నిబంధనల రూపకల్పనలో సంస్కరణలు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ వ్యవస్థల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. ప్రస్తుత వ్యవస్థలు అన్ని దేశాల ఆకాంక్షలను సమర్థంగా ప్రతిబింబించలేకపోతున్నాయని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మరింత సమానత్వం, పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు.

**గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం**

భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వాటిని నియంత్రించే నిబంధనల రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని బ్రిక్స్ దేశాలు నొక్కి చెప్పినట్లు మోదీ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలను నిర్ణయాల ప్రక్రియకు దూరంగా ఉంచడం సరికాదని అన్నారు. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణ ద్వారానే పూడ్చగలమని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు చేపట్టడంతో పాటు, అన్ని దేశాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు.





**ఉమ్మడి సంకల్పానికి దిశానిర్దేశం**

శనివారం ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్ బ్రిక్స్ దేశాల ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. డిక్లరేషన్‌లోని తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చాల్సిన బాధ్యత ఇప్పుడు సభ్యదేశాలన్నింటిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, పరస్పర చర్చలు, దౌత్యపరమైన ప్రయత్నాలు, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా ముందుకు సాగవచ్చని ఢిల్లీ డిక్లరేషన్ ద్వారా స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభంపై విభిన్న అభిప్రాయాలు ఉన్న దేశాలు ఒకే ప్రకటనకు అంగీకరించడం బ్రిక్స్ వేదికపై భారత్ దౌత్యపరమైన ప్రాధాన్యాన్ని మరింత పెంచింది.



# సుద్దాల అశోక్ తేజకు తెలంగాణ తెలుగు తేజం పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు.

**భాషా సేవలకు గుర్తింపు**

తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని వివరించారు.

**22న కరీంనగర్‌లో ప్రదానం**

తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22న కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలంగాణ మట్టిబిడ్డలు తెలుగు భాషకు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు.

**సాహిత్య, సినీ రంగాల్లో ప్రత్యేక ముద్ర**

సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతోపాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు.

# 2–3 ఏళ్లలో ఈ-బైక్‌ల వాటా 20 శాతానికి

(మొదటిపేజీ తరువాయి)

పెంచనున్నారు. ప్రస్తుతం ఉన్న 50-60 వేల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలుపుకొని.. 2-3 ఏళ్లలో మొత్తం సామర్థ్యాన్ని 3 లక్షల యూనిట్లకు, 5 ఏళ్లలో 5 లక్షల యూనిట్లకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

**రూ.2 లక్షలలోపే కొత్త బైక్‌లు**

ప్రస్తుతం ఎఫ్77, ఎక్స్47 మోడళ్లను విక్రయిస్తున్న అల్ట్రావైలెట్.. త్వరలో *షాక్‌వేవ్ మోటార్‌సైకిల్, టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్*ను మార్కెట్లోకి తీసుకురానుంది. రాబోయే 2 ఏళ్లలో తమ మోడళ్ల సంఖ్యను 6కు పెంచాలని నిర్ణయించింది. కొత్త మోడళ్ల ధరలను రూ.2 లక్షలలోపే ఉండేలా చూస్తున్నామని సంస్థ కోఫౌండర్, సీటీఓ నీరజ్ రాజ్‌మోహన్ తెలిపారు. కొత్త ఉత్పత్తుల రాకతో నెలకు 10 వేల యూనిట్ల విక్రయాలను సాధించగలమని సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

**విదేశీ మార్కెట్లపైనా దృష్టి**

ప్రస్తుతం 20 యూరోపియన్ దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అల్ట్రావైలెట్.. తదుపరి దశలో ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మార్కెట్లలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. స్కూటర్ల విభాగంలో ప్రారంభమైన ఎలక్ట్రిక్ మార్పు ఇప్పుడు మోటార్‌సైకిళ్ల విభాగానికీ విస్తరిస్తోందని సంస్థ సీఈఓ నారాయణ్ సుబ్రమణ్యం తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పెరుగుతున్న ఇంధన ధరలు, వినియోగదారుల అభిరుచుల్లో మార్పులు ఎలక్ట్రిక్ బైక్‌లకు డిమాండ్‌ను పెంచుతున్నాయని పేర్కొన్నారు.

# ప్రజలకు చేరువగా హైడ్రా సేవలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన సమాచారాన్ని ప్రజలు పరిశీలించవచ్చు. హెచ్ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా వెళ్లే అవకాశం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలను తెలుసుకోవచ్చు. తెలంగాణ ప్రభుత్వ భూ భారతి పోర్టల్‌కు కూడా లింక్ ఇచ్చారు. భూముల కొనుగోలు, ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా భూ రికార్డులను పరిశీలించుకోవచ్చు.

**అత్యవసర సమాచారం అందుబాటులో**

హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచింది. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు లేదా ఇతర విపత్తు పరిస్థితులపై ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంది. అధికారులు డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించనున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక మ్యాప్‌లను అందుబాటులో ఉంచారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం కూడా పోర్టల్‌లో లభిస్తుంది. వార్తలు, ఫ్లాష్‌న్యూస్, ఫొటోలు, వీడియోల ద్వారా హైడ్రా కార్యకలాపాలను ప్రజలు తెలుసుకోవచ్చు.



# దసరా నుంచి కొత్త చేయూత పెన్షన్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్డీవోలకు ధ్రువీకరణ పత్రం ఇచ్చే అధికారం ఉంది. అయితే 2 ఏళ్లు దాటిన తర్వాత ఎవరు సర్టిఫికెట్ ఇవ్వాలనే అంశంపై స్పష్టత లేకపోవడంతో వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులకూ ధ్రువీకరణ పత్రాల జారీ సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో సెర్ప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఒంటరి మహిళలకు తహసీల్దార్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పురపాలక, నగరపాలక సంస్థల్లో మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు కూడా సర్టిఫికెట్లు జారీ చేయాలని శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. వితంతువులకు ధ్రువీకరణ పత్రాల జారీలో వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వ అనుమతి కోరింది.

# ఒకే పరిపాలన.. ఒకే చట్టం!

(మొదటిపేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ పరిధికే పరిమితమైన పాత విధానానికి భిన్నంగా హైడ్రా, జలమండలి, పోలీసు తదితర కీలక వ్యవస్థలను సమన్వయ పరిపాలనలో భాగం చేయనున్నారు.

**అక్రమ నిర్మాణాలపై నాలుగు రకాల చర్యలు**

అనుమతిలేని నిర్మాణాలపై జరిమానా, కూల్చివేత, సీజ్, సౌకర్యాల నిలిపివేత వంటి 4 రకాల చర్యలకు క్యూర్ బిల్లు అవకాశం కల్పిస్తోంది. ఆస్తిపన్నుపై 100 నుంచి 300 శాతం వరకు జరిమానా విధించే నిబంధనను ప్రతిపాదించారు. మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇచ్చిన 15 రోజుల్లోగా అక్రమ నిర్మాణాన్ని యజమానే తొలగించాలి. నిర్ణీత గడువులో తొలగించకపోతే అధికారులు కూల్చివేసి, అందుకు అయిన ఖర్చును ఆస్తిపన్నులో కలపవచ్చు. ప్రజల భద్రతకు ముప్పుగా ఉన్న భవనాలను ముందస్తు నోటీసు లేకుండానే సీజ్ చేసే అధికారం అధికారులకు ఇవ్వనున్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనాలకు విద్యుత్తు, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లను నిలిపివేయవచ్చు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతోపాటు వాటిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చే అవకాశం కూడా బిల్లులో ఉంది.

**అప్పీల్‌కు 30 రోజుల గడువు**

మున్సిపల్ కమిషనర్ జారీ చేసే ఉత్తర్వులు, నోటీసులపై ప్రజలు 30 రోజుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక క్యూర్ అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. సివిల్ కోర్టు తరహా అధికారాలతో ఈ సంస్థ పనిచేయనుంది. ప్రజలకు న్యాయపరమైన పరిహారం లభించేలా అప్పీల్ వ్యవస్థను రూపొందించనున్నారు. క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలు అందించాలని బిల్లులో ప్రతిపాదించారు. భవన అనుమతులు, ఆస్తిపన్నులు, రుసుముల చెల్లింపులతోపాటు భవిష్యత్తులో ఇతర శాఖల సేవలను కూడా ఒకే పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నారు. ప్రతి భవనానికి ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, ప్రతి ఫ్లాట్‌కు సబ్ ఐడెంటిటీ కోడ్ ఇవ్వనున్నారు. దీంతో ఆస్తిపన్ను, విద్యుత్తు, నీటి బిల్లులు తదితర చెల్లింపులను ఒకే గుర్తింపు సంఖ్యతో నిర్వహించే అవకాశం ఉంటుంది. వివిధ శాఖల వద్ద వేర్వేరుగా రికార్డులు ఉండటం, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రతిపాదించింది.




**ఆస్తిపన్ను విధానంలో మార్పులు**

ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ ఆధారిత ఆస్తిపన్ను విధానానికి బదులుగా భూ విలువ ఆధారిత పన్ను విధానాన్ని తీసుకురావాలని క్యూర్ బిల్లు ప్రతిపాదిస్తోంది. నివాస భవనాలకు భూవిలువలో 0.10 నుంచి 0.50 శాతం వరకు, నివాసేతర భవనాలకు 0.20 నుంచి 2 శాతం వరకు, ఖాళీ స్థలాలకు 0.50 శాతం వరకు పన్ను విధించే అవకాశం ఉంది. అయితే ప్రజలపై ఒక్కసారిగా భారం పడకుండా ఏటా గరిష్ఠంగా 20 శాతం చొప్పున పన్ను పెంచుతూ బెంచ్‌మార్క్ స్థాయికి తీసుకెళ్లే విధానాన్ని ప్రతిపాదించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతంతో పోలిస్తే పన్ను తగ్గే అవకాశమూ ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

**పర్యావరణ పరిరక్షణకు 10 శాతం నిధులు**

పర్యావరణ పరిరక్షణకు ఏటా బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులు కేటాయించాలని బిల్లులో ప్రతిపాదించారు. నెట్‌జీరో విధానాన్ని ప్రోత్సహించడం, మురుగునీటిని పూర్తిగా శుద్ధి చేసి పునర్వినియోగించడం, నగరంలో పర్యావరణహిత చర్యలను అమలు చేయడంపై దృష్టి పెట్టనున్నారు. నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తే రూ.లక్ష వరకు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను డంపింగ్ చేస్తే రూ.2 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. నగరంలో నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, ఖాళీ స్థలాల పరిరక్షణ, మురుగునీటి శుద్ధి వంటి అంశాలను సమగ్రంగా పర్యవేక్షించేందుకు కొత్త చట్టంలో ప్రత్యేక నిబంధనలు పొందుపరిచారు.

**హైడ్రాకు చట్టబద్ధత.. అదనపు అధికారాలు**

క్యూర్ బిల్లుతో హైడ్రాకు చట్టపరమైన గుర్తింపుతోపాటు అదనపు అధికారాలు దక్కనున్నాయి. ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా నిర్దిష్ట నేరాలపై కేసులు నమోదు చేసే అవకాశం కల్పించనున్నారు. అగ్నిమాపక భద్రత, నిర్మాణ వ్యర్థాల డంపింగ్, అక్రమ కార్యకలాపాలపై తనిఖీల్లోనూ హైడ్రాకు అధికార పరిధి ఏర్పడనుంది.

ప్రస్తుతం వేర్వేరు సంస్థల పరిధిలో ఉన్న నగర నిర్వహణ అంశాలను సమన్వయ పరిచేందుకు హైడ్రా, జలమండలి, పోలీసు, పురపాలక సంస్థలు కలిసి పనిచేసేలా చట్టంలో వ్యవస్థను రూపొందించారు. వరదలు, అక్రమ నిర్మాణాలు, చెరువుల పరిరక్షణ, ట్రాఫిక్, మౌలిక వసతులు వంటి అంశాలపై సమగ్ర నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించనున్నారు.

**ప్రజల అభిప్రాయాలపై మార్పులు**

క్యూర్ బిల్లుపై ప్రజల నుంచి జులై 4 నుంచి 24 వరకు ప్రభుత్వం అభిప్రాయాలు స్వీకరించింది. ఆన్‌లైన్‌లో 4,107, ఈమెయిల్ ద్వారా మరో 400 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో 2,465 అభ్యంతరాలు ఆస్తిపన్ను పెంపునకు సంబంధించినవే కావడం గమనార్హం. ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన సూచనలను పరిశీలించిన తర్వాత బిల్లులో కొన్ని మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మహానగరంలోని వివిధ సంస్థల మధ్య సమన్వయం పెంచడం, పౌర సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజలకు అప్పీల్ అవకాశాలు కల్పించడం వంటి అంశాలతో క్యూర్-2026 బిల్లును రూపొందించారు.

## బీజేపీ గూటికి బీఆర్ఎస్ నేత



**కాకతీయ, నల్లబెల్లి :** మండలంలోని మామిండ్లవీరయ్యపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిండ్ల మోహన్‌రెడ్డి బీజేపీలో చేరారు. మండల బీజేపీ అధ్యక్షుడు తడుక వినయ్ అధ్యక్షతన, వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి ప్రజల ఆదరణ పెరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో నర్సంపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, రాణా ప్రతాప్‌రెడ్డి ప్రజాసేవకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు.

## అనారోగ్యంతో విలేకరి ఐలయ్య మృతి



**కాకతీయ, పెద్దవంగర :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలానికి చెందిన విలేకరి చింతల ఐలయ్య శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో మృతి చెందారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రజా ప్రతిజ్ఞ దినపత్రికలో పెద్దవంగర మండల విలేకరిగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వర్తించారు. గతంలో వివిధ తెలుగు దినపత్రికల్లో పనిచేసి ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పెద్దవంగర మండల కేంద్రంగా కీలకంగా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఐలయ్య మృతదేహానికి స్వస్థలం గట్లకుంట గ్రామంలో పెద్దవంగర మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామ్మూర్తి, సభ్యులు బుచ్చన్న, యాకన్న, వేణు, రాజు, మల్లేష్, మధు, బాలాజీ, మురళి, సతీష్, రత్నాకర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 1,254 పెండింగ్ కేసుల పరిష్కారం




**కాకతీయ, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. వరంగల్ జిల్లాలో 9 బెంచీలు ఏర్పాటు చేసి 520 పెండింగ్ కేసులను పరిష్కరించారు. వీటిలో 64 సివిల్ కేసులు, 53 ఎంవీఓపీ కేసులు, 11 ఇతర సివిల్ కేసులు, 456 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎంవీఓపీ కేసుల్లో రూ.6.72 కోట్లకు పైగా పరిహారం పరిష్కరించారు. అలాగే 26 బ్యాంకు పీఎల్‌సీ, 6 బీఎస్ఎన్ఎల్ పీఎల్‌సీ, 63,002 ట్రాఫిక్ ఈచలాన్ కేసులు, 19 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించారు. హనుమకొండ జిల్లాలో 12 బెంచీలు ఏర్పాటు చేసి 734 పెండింగ్ కేసులను పరిష్కరించారు. ఇందులో 56 సివిల్, 47 ఎంవీఓపీ, 678 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎంవీఓపీ కేసుల్లో రూ.61.25 లక్షలకు పైగా పరిహారం పరిష్కరించారు. అదేవిధంగా 41 బ్యాంకు పీఎల్‌సీ, 17 విద్యుత్ పీఎల్‌సీ, 36,622 ట్రాఫిక్ ఈచలాన్, 18 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు, సిబ్బంది, కక్షిదారులు తదితరులందరికీ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సుబ్రహ్మణ్యం ఆరోగ్యంపై కొండా సురేఖ ఆరా

**కాకతీయ, వరంగల్ :** ఓఎస్డీ సుమంత్ తండ్రి నార్ల సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులకు సూచించారు. సుబ్రహ్మణ్యం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కొండా సురేఖ ఆకాంక్షించారు.



# సేవే శ్వాసగా.. పువ్వాడ కుటుంబం

- ఏళ్లుగా పేదల కోసం ఉచిత సేవా కార్యక్రమాలు
- పువ్వాడ నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా మరో సేవా సంకల్పం
- 88 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీకి ఏర్పాట్లు



**కాకతీయ, ఖమ్మం:** పేదల కష్టాన్ని తన కష్టంగా భావించడం.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. సేవను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా జీవిత విధానంగా కొనసాగించడం.. ఇదే పువ్వాడ కుటుంబం ప్రత్యేకత. రాజకీయాల్లో ఉన్నా.. ప్రజా జీవితంలో ఉన్నా.. మానవత్వమే మార్గంగా ముందుకు సాగుతున్న పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబం సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలుస్తోంది. ఏళ్ల తరబడి ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు ఉచిత వైద్యం, శస్త్రచికిత్సలు, మందుల పంపిణీతో పాటు గర్భిణులకు సహాయం, కరోనా సమయంలో ఆపన్నహస్తం అందించడం వంటి అనేక సేవలను పువ్వాడ కుటుంబం కొనసాగిస్తోంది. మమత ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలు ఎన్నో కుటుంబాలకు భరోసాగా నిలిచాయి.

**జన్మదిన వేడుకల్లో సేవా పరిమళం**

పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినం సందర్భంగా మరో విశిష్ట సేవా కార్యక్రమానికి కుటుంబ సభ్యులు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 13న సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని రోటరీ క్లబ్‌లో 88 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాలను పంపిణీ చేయనున్నారు. పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా కాకుండా.. అవసరంలో ఉన్నవారికి ఉపయోగపడేలా నిర్వహించడం పువ్వాడ కుటుంబం సేవా దృక్పథానికి నిదర్శనం. పువ్వాడ నాగేశ్వరరావు 75వ జన్మదినం నుంచి ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత 15 ఏళ్లలో దాదాపు 1,000 మందికి వివిధ రూపాల్లో సహాయం అందించారు. వైద్య సేవలు, ఆపరేషన్లు, మందులు, పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు, దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి. పువ్వాడ నాగేశ్వరరావు చూపిన సేవా మార్గాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ.. వారి సమస్యలను తెలుసుకుంటూ.. సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలనే తపనతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్నారు. సేవకు కుటుంబమంతా ఒక్కటై నిలవడం ఖమ్మం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.



## డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- భూముల వివరాల నమోదులో కచ్చితత్వం పాటించాలి
- రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**కాకతీయ, వరంగల్ :** భూముల వివరాల నమోదులో కచ్చితత్వం పాటిస్తూ డిజిటల్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మ్యాప్‌లోని వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలను నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ఖిలా వరంగల్‌లోని స్తంభంపల్లి గ్రామంలో శనివారం నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో భాగంగా చేపడుతున్న భూముల వివరాల నమోదు, మ్యాప్‌లోని వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలించారు. సర్వే ప్రక్రియలో వినియోగిస్తున్న సాంకేతికత, భూముల హద్దులు, వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టి భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మ్యాప్ వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య తేడాలు ఉంటే వాటిని నిశితంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వరంగల్ ఆర్డీవో సుమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, స్తంభంపల్లి గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

## జ్ఞాన, అజ్ఞానాలకు వారధిగా శ్రీకృష్ణుడు

- జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు
- కాజీపేటలో ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** దేవుడే మనిషిగా అవతరించినప్పుడే భగవంతుడవుతాడని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని, ఆయనను మాత్రమే దైవంగా గుర్తించాలనే సందేశాన్ని చాటుతూ కాజీపేటలో శ్రీకృష్ణుడి ఊరు ఎరిగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లోని ఏఎల్ఎస్ కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 04సెప్టెంబర్ 2026 శుక్రవారం రోజున శ్రీకృష్ణ జన్మాష్టమి వేదికను ఏర్పాటు చేసి శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి జ్ఞాన పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొలువు ప్రాంగణం నుండి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ గారు ఈ ఊరేగింపును ప్రారంభించారు.

**అష్టమి విశిష్టతను చాటిన వేడుక**

కృష్ణుడు పౌర్ణమి, అమావాస్యలకు మధ్య అష్టమి తిథిలో జన్మించి జ్ఞాన, అజ్ఞానాలకు వారధిగా నిలిచాడని, ఈ తత్వాన్ని ఊరిలోని ప్రతి ఒక్కరికీ ఎరుకపరచడానికే ఈ ఊరు ఎరిగింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఇదే వేడుకల వెనుక ఉన్న అసలు పరమార్థమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు వెంకటాచార్యులు, శశిరెడ్డి, సుధాకర్, రాజు, రాజలింగం, రాజకుమార్, కుమార్, ఆది విష్ణు, సిద్దయ్య, రాధిక, భార్గవి, విమల, దివ్య ప్రబోధ సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వల్లాల సదానందం గౌడ్

**కాకతీయ, హనుమకొండ :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన తెలంగాణ టీచర్స్ యూనియన్ మాజీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వల్లాల సదానందం గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తెలిపారు. శనివారం గోపాల్‌పూర్‌లో జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాందాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం సదానందం గౌడ్ గత కొన్నేళ్లుగా చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించినట్లు రమేష్ గౌడ్ తెలిపారు. నియామకమైన నాటి నుంచి 2 సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారని చెప్పారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. 50 సంవత్సరాలు నిండిన అర్హులైన గీత కార్మికులందరికీ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సా గౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధి రాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు తోటకూరి రాందాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి బొమ్మగాని శ్యామ్‌కుమార్ గౌడ్‌లకు సదానందం గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.





# కామారం భూభాగంపై పూర్తి ఆధారాలు

- 146వ సర్వే ప్రకారం ఆధారాలు మా వద్దే ఉన్నాయి
- 2020 నుంచి భూహక్కుల కోసం పోరాటం
- వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- గ్రామ సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి

**కాకతీయ, ఏటూరునాగారం :** 146వ సర్వే ప్రకారం కామారం గ్రామానికి సంబంధించిన భూభాగంపై పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని గ్రామ సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి తెలిపారు. ఆ ఆధారాలతోనే మీడియా ముందు వాస్తవాలను వివరించినట్లు పేర్కొన్నారు. 2020 నుంచి ఈ భూభాగం కోసం గ్రామస్థుల పోరాటం కొనసాగుతోందని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తాడ్వాయి సర్పంచ్ వాస్తవాలను పూర్తిగా తెలుసుకుని మాట్లాడాలని కామారం సర్పంచ్ సావిత్రి, గ్రామస్థులు సూచించారు. పూర్తి సమాచారం లేకుండా కామారం గ్రామ భూభాగంపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తమ భూభాగం జోలికి రావద్దని, తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో కామారం గ్రామపంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలం

- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- జాబ్ క్యాలెండర్‌తో సమగ్ర నోటిఫికేషన్లు జారీ చేయాలి
- నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇవ్వాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్




**కాకతీయ, ములుగు ప్రతినిధి :** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. ప్రభుత్వాల అసమర్థ విధానాలతో దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన డీవైఎఫ్ఐ ములుగు జిల్లా 2వ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

**ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడిచినా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించలేదని ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. నీట్, రైల్వే, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు విద్యార్థులు, యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లోని

ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు గడిచినా జాబ్ క్యాలెండర్‌తో పాటు పలు హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. సమగ్ర వివరాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు.

**స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేయాలి**

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి కోసం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తులు స్వీకరించడంతోనే ప్రభుత్వం సరిపెట్టకుండా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల బారినుంచి కాపాడాలని సూచించారు. ములుగు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అరుణ్, లాజర్, పూనెం కృష్ణబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్న ప్రవీణ్, జిల్లా నాయకులు మమత, శ్యామ్, రమేష్, రాఘవేంద్ర, సంతోష్, శివ, ప్రవీణ్, లోకేష్, అశోక్, దినేష్‌తో పాటు సుమారు 100 మంది యువత పాల్గొన్నారు.



# సీఆర్పీ కవితకు ఉత్తమ పురస్కారం

**కాకతీయ, నెల్లికుదురు:** మండల కేంద్రం నెల్లికుదురు ఎమ్మార్సీలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్న బైరు కవిత గౌడ్ కు ఇటీవల జరిగిన గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఉత్తమ పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఎంఈఓ ఆంగోతు రాందాస్ స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో నిర్వహించిన పురస్కార ప్రదాన కార్యక్రమంలో కవితను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మెమెంటో, ప్రశంసాపత్రంతో పాటు ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు.

ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన బైరు కవిత 2012 నుంచి విద్యాశాఖలో సీఆర్పీగా విశేష సేవలు అందిస్తున్నారు. తొలుత రాజుల కొత్తపల్లి క్లస్టర్‌లో సీఆర్పీగా పనిచేసిన ఆమె ప్రస్తుతం మేచరాజుపల్లి హైస్కూల్ కాంప్లెక్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ సూచనల మేరకు డీఈఓ, ఎంఈఓల ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ, విద్యాశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, విద్యాసంబంధిత అంశాలను కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు.

అదేవిధంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సహాయకురాలిగా ఉంటూ, పాఠశాలలకు సంబంధించిన వివిధ విద్యా కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె అందిస్తున్న సేవలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు నెల్లికుదురు మండల స్థాయిలో ఉత్తమ సీఆర్పీగా ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డు గ్రహీత సీఆర్పీ కవిత మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సహకారంతోనే సీఆర్పీగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగానని తెలిపారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని, అదే సమయంలో తనపై మరింత బాధ్యత పెరిగిందని వినమ్రతతో పేర్కొన్నారు.

**కాంప్లెక్స్‌లో కవితకు ఘన సన్మానం..**

నెల్లికుదురు మండల స్థాయిలో ఉత్తమ సీఆర్పీగా ఎంపికై అవార్డు అందుకున్న బైరు కవితను ఆమె సీఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్న మేచరాజుపల్లి జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ఉపాధ్యాయులు కవితను అభినందిస్తూ, విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరెన్నో పురస్కారాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'నాతోనే మార్పు' కార్యక్రమంలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయులు–విద్యార్థుల బలమైన అనుబంధంపై అవగాహన

**కాకతీయ,ఏటూరునాగారం,రూరల్ :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం జూనియర్ కాలేజ్ (గర్ల్స్), ఏటూరునాగారంలో 'నాతోనే మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థులు చెడు వ్యసనాలు, మొబైల్ ఫోన్ అధిక వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సత్ప్రవర్తన, క్రమశిక్షణతో విద్యను కొనసాగించేలా అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాదిక్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య బలమైన అనుబంధం ఎంతో అవసరమని అన్నారు. పిల్లల భావాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని సూచించారు. "ప్రేమతో కలుద్దాం - బాధ్యతతో వ్యవహరిద్దాం, బడిని వదలొద్దు - భవిష్యత్తును కోల్పోవద్దు, విని అర్థం చేసుకుందాం - తోడుగా నిలుద్దాం" అనే సందేశంతో విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. మొబైల్ ఫోన్‌కు బానిస కాకుండా జాగ్రత్త వహించాలని, చెడు వ్యసనాలు మరియు ఆకర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు, ఎవరితో స్నేహం చేస్తున్నారు, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు.







పిల్లలను కళాశాలలో చేర్పించే సమయంలో వారి ఆరోగ్య పరిస్థితి, ప్రత్యేక అవసరాలు వంటి విషయాలను ఉపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. "నా బిడ్డ ఆరోగ్యం - నా బాధ్యత, మా బడి - మా గుడి" అనే భావనతో తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తన, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సాదిక్ తెలిపారు. పిల్లల భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. విమల మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యార్థులు వివిధ చెడు అలవాట్లకు ఆకర్షితులయ్యే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు ఇంటికి వచ్చినప్పుడు వారి చదువు, కళాశాల అనుభవాలు, స్నేహితులు, ప్రవర్తన తదితర విషయాలను ప్రేమగా అడిగి తెలుసుకోవాలని అన్నారు. అలాగే, తమ పిల్లలు కళాశాలలో ఎలా ఉంటున్నారనే విషయాన్ని సంబంధిత హౌస్ మాస్టర్లను అడిగి తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. కళాశాలలో విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తు కోసం శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లలను ఇంటి వద్ద కూడా జాగ్రత్తగా గమనిస్తూ, వారి చదువు మరియు ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ప్రిన్సిపాల్‌కు హామీ ఇచ్చారు. చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాలని కోరారు.

ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తల్లిదండ్రులు సూచించారు. విద్యార్థులకు నిరంతరం మోటివేషన్ కల్పించడం ద్వారా వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు, తమ లక్ష్యాల పై దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాలపై కూడా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని కోరారు. "మీ పిల్లల చదువును గమనించండి - వారి భవిష్యత్తును నిర్మించండి" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునులు మరియు విద్యార్థినిలు ,తల్లిదండ్రులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయలో 9, 11 తరగతులకు ప్రవేశాలు

- సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఏప్రిల్ 10, 2027న లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్
- గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్ల కేటాయింపు
- పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి. రమేష్




**కాకతీయ, వరంగల్ :** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027-28 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే లేటరల్ ఎంట్రీ సెలెక్షన్ టెస్ట్-2027కు అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం, మామూనూర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి. రమేష్ తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి విధానం ప్రకారం బాహ్య సంస్థ నిర్వహించే ఎంపిక పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి ప్రవేశానికి అర్హులని టి. రమేష్ తెలిపారు. విద్యార్థి జన్మతేది 01052012 నుంచి 31072014 మధ్య ఉండాలని, రెండు తేదీలను కలుపుకొని పరిగణిస్తామని చెప్పారు. విద్యార్థి ప్రవేశం కోరుతున్న జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదివి విద్యా సంవత్సరం పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 11వ తరగతి ప్రవేశానికి 2026-27 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వారి జన్మతేది 01062010 నుంచి 31072012 మధ్య ఉండాలని, అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదివి విద్యా సంవత్సరం పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. 9వ, 11వ తరగతులకు ఎంపిక పరీక్ష 1004 2027న నిర్వహించనున్నట్లు తెలిపారు.

**గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు**

నవోదయ విద్యాలయాలు పూర్తిగా ఉచిత విద్య అందించే సహవిద్యా, నివాస పాఠశాలలని టి. రమేష్ తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ అనుబంధంతో, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యప్రణాళిక ఆధారంగా ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన ఉంటుందని చెప్పారు. 9వ తరగతిలో హిందీ మాట్లాడే ప్రాంతాల నుంచి హిందీ మాట్లాడని ప్రాంతాలకు, అలాగే దీనికి విరుద్ధంగా విద్యార్థుల మైగ్రేషన్ విధానం ఉంటుందని వివరించారు. ప్రవేశాల్లో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారని తెలిపారు. విద్యార్థి తన చదువులో ఏదైనా భాగాన్ని పట్టణ ప్రాంతంలో చదివినట్లయితే అర్బన్ అభ్యర్థిగా పరిగణిస్తామని పేర్కొన్నారు. పాఠశాల గ్రామపంచాయతీ పరిధిలో ఉంటే గ్రామీణ ప్రాంతంగా, మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్ పరిధిలో ఉంటే పట్టణ ప్రాంతంగా పరిగణిస్తారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, బాలికలకు భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతర రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

**అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు**

అర్హులైన విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టి. రమేష్ సూచించారు. 9వ, 11వ తరగతుల ప్రవేశాలకు ప్రత్యేక ఆన్‌లైన్ దరఖాస్తు లింకులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు గడువులోగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# ఫిన్లాండ్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు అంజుమ్ సుల్తానా ఎంపిక

- వినూత్న బోధనా పద్ధతులపై అధ్యయనం
- సాంకేతికత, సమ్మిళిత విద్య, మూల్యాంకన విధానాలపై అవగాహన
- అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



**కాకతీయ, నెల్లికుదురు:** ఫిన్లాండ్‌లోని వినూత్న, అనుభవాత్మక, కార్యకలాప ఆధారిత బోధనా పద్ధతులను అధ్యయనం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ సోషల్ స్టడీస్ టీజీటీ, తెలంగాణ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎం.ఏ. అంజుమ్ సుల్తానా తెలిపారు. ఫిన్లాండ్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఆమె ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అంజుమ్ సుల్తానా మాట్లాడుతూ సాంకేతికత వినియోగం, సమ్మిళిత విద్య, మూల్యాంకన విధానాలపై అవగాహన పొందనున్నట్లు తెలిపారు. అక్కడ సేకరించే జ్ఞానం, అనుభవాలను తరగతి గది కార్యకలాపాలు, ప్రాజెక్టులు, డిజిటల్ వనరుల ద్వారా విద్యార్థులకు అందిస్తానన్నారు. తద్వారా చదువును మరింత ఆసక్తికరంగా, అర్థవంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. జిల్లా అధికారుల అనుమతితో ఎక్స్‌పోజర్ విజిట్‌లో పొందిన అనుభవాలను జిల్లాలోని సహ ఉపాధ్యాయులతో పంచుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, సహ ఉపాధ్యాయులు అంజుమ్ సుల్తానాను అభినందించారు.

# మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవు

- మైనర్ డ్రైవర్లపై కాజీపేట ట్రాఫిక్ పోలీసుల కేసులు
- మార్పులు చేసిన సైలెన్సర్లతో శబ్ద కాలుష్య కేసులు
- తల్లిదండ్రులు, వాహన యజమానులకు కౌన్సెలింగ్



**కాకతీయ, హనుమకొండ:** 18 సంవత్సరాలు నిండకముందే మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు, వాహన యజమానులు బాధ్యత వహించాలని సూచించారు. హంటర్ రోడ్‌లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో శబ్ద కాలుష్యంతో వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. 2 ద్విచక్ర వాహనాలకు మార్పులు చేసిన సైలెన్సర్లు ఉండటంతో శబ్ద కాలుష్య కేసులు కూడా నమోదు చేశారు. మైనర్ల తల్లిదండ్రులు, వాహన యజమానులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో పట్టుబడిన 9 మంది మైనర్లను కోర్టులో హాజరుపరచగా, ఒక్క రోజు జువైనల్ హోమ్‌కు పంపుతూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత వాహన యజమానులకు జరిమానాలు విధించారు. మైనర్లకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచడంతో పాటు జరిమానా లేదా జైలు శిక్ష పడే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు. పిల్లల భద్రత, రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని 18 సంవత్సరాలు నిండే వరకు వాహనాలు నడపడానికి అనుమతించవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఏళ్లు గడుస్తున్నా...మూత్రశాలలు ఏవి సామీ?

- తీరని బస్ స్టాండ్ కష్టాలు..
- చోద్యం చూస్తున్న ఆర్టీసీ,పంచాయతీ అధికారులు
- రూ.5 లక్షల ఎస్డిఎఫ్ నిధులతో చేపట్టిన మూత్రశాలల నిర్మాణం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు,వృద్ధులు
- తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని ప్రజల డిమాండ్






**కాకతీయ,రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సుమారు బస్టాండ్ ప్రారంభమై 6 సంవత్సరాల 9 నెలలు పూర్తవుతున్నప్పటికీ,నేటికీ ప్రయాణికుల కోసం మూత్రశాలలు నిర్మించకపోవడం శోచనీయం.నిత్యం వందలాదిమంది ప్రయాణికులు,విద్యార్థులు,ఉద్యోగులు, వరంగల్,ఖమ్మం,తొర్రూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మూత్రశాలలు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు,చిన్నపిల్లలు,వృద్ధులు,గర్భిణీల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.కొంతమంది ప్రయాణికులు బస్టాండ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.దింతో బస్టాండ్ పరిసర ప్రాంతంలోని సమీప నివాసితులు,వ్యాపారులు దుర్గంధంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ ప్రాంగణంలో ఏళ్లు గడుస్తున్నా..మూత్రశాలలు ఏవి స్వామి? అంటూ ప్రయాణికులు,స్థానిక ప్రజలు నిలదీస్తున్నారు.

**రూ.5 లక్షలు బూడిదలో పోసిన పన్నీరేనా?**

ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గతంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్డిఎఫ్) నుంచి సుమారు రూ.5 లక్షలు వెచ్చించి మూత్రశాలల నిర్మాణం చేపట్టారు.అయితే..ఆ నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయి కేవలం పిల్లర్లు,స్లాబ్ స్థాయికే పరిమితమైంది.స్లాబ్ పోసి అర్ధాంతరంగా పనిని మధ్యలోనే వదిలేయడంతో లక్షల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరేనా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అలాగే ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అరకొరగా మిగిలిపోయిన మూత్రశాలల నిర్మాణం ఇప్పుడు చెత్త చెదారంతో పాడుబడిన భవనంలా దర్శనమిస్తోందని మండిపడుతున్నారు.

**అధికారుల ఉదాసీనత :**

'స్వచ్ఛత' గురించి ఉపన్యాసాలు దంచికొట్టే ప్రజాప్రతినిధులు,అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు,పంచాయతీ పాలకులు తక్షణమే స్పందించి రాయపర్తి బస్టాండ్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలల నిర్మాణం తక్షణమే పూర్తి చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**నిధులు విడుదల కాకపోవడం వల్లే పనులు ఆగాయి**
**పంచాయతీ కార్యదర్శి యాకుబ్ నాయక్**

గతంలో మూత్రశాలల నిర్మాణానికి మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డిఎఫ్) ప్రభుత్వం నుంచి రాకపోవడం వల్లే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని అన్నారు. అప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి బకాయి బిల్లులు చెల్లిస్తే తప్ప,తదుపరి పనులు ప్రారంభించబోమని కాంట్రాక్టర్ స్పష్టం చేశారని తెలిపారు.నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కార్యదర్శి యాకుబ్ నాయక్ వివరణ ఇచ్చారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266